సాక్షి
యాదాద్రి భువనగిరి

మంగళవారం । 26 । నవంబర్ । 2024



గుట్టకు పోటెత్తిన భక్తులు
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని సోమవారం 30వేలకు పైగా భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. -8లో



పత్తి మిల్లులో అగ్నిప్రమాదం
ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలోని పత్తి మిల్లులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి పత్తి దగ్ధమైంది. - 8లో



జీఐ సమ్మిట్‌లో..
ఢిల్లీలో నిర్వహించిన జియోగ్రాఫికల్ ఇండికేషన్ సమ్మిట్‌లో భూదాన్‌పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను ప్రదర్శించారు. - 10లో

న్యూస్‌రీల్

మోత్కూరు వాసికి డాక్టరేట్



జిలుకర స్వామి

మోత్కూరు : మండలంలోని దత్తప్పగూడెం గ్రామానికి చెందిన జిలుకర స్వామి ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి జంతుశాస్త్రం విభాగంలో డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టా పొందారు. ప్రొఫెసర్ సునితాదేవి పర్యవేక్షణలో కృష్ణబొచ్చె, చేపల పెరుగుదల, ఆహారమార్పిడి, జీవరసాయన మార్పులపై చేసిన పరిశోధనలకు గాను డాక్టరేట్ వచ్చినట్లు స్వామి తెలిపారు. స్వామి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. డాక్టరేట్ పట్టా పొందడంతో తల్లిదండ్రులు ఈదమ్మ, వెంకటయ్య, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

స్వర్ణగిరి క్షేత్రంలో కార్తీక వనభోజనాలు



వన భోజనాలను ప్రారంభిస్తున్న రామారావు

భువనగిరి : కార్తీకమాసం సందర్భంగా సోమవారం భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వస్వామి దేవాలయంలో వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మానేపల్లి రామారావు కార్తీక వనభోజనాలను ప్రారంభించారు. సుమారు 3 వేల మంది వనభోజనాల్లో అందజేశారు. అదే విధంగా ఆలయంలో సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, నిత్యకల్యాణం తదితర పూజలు చేపట్టారు.

వ్యాక్సినేషన్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఐఓ

రాజాపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా ఇమ్యూనైజేషన్ (డీఐఓ)అధికారి డాక్టర్ రామకృష్ణ సందర్శించారు. వైద్యసిబ్బందితో సమావేశమై గ్రామ, మండలస్థాయిలో వ్యాక్సినేషన్ అమలు, ఆస్పత్రిలో కేసుల నివేదికలు, వ్యాధుల నియంత్రణ, నివారణ తదితర అంశాలపై సమీక్షించారు. ఆరోగ్య సిబ్బందికి ఇమ్యూనైజేషన్‌పై అవాహన కల్పించారు. సమావేశంలో మండల వైద్యాధికారి డాక్టర్ భరత్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

నల్లగొండ : క్రిస్మస్- 2024 వేడుకల్లో పురస్కారాలు పొందడానికి అరులైన క్రైస్తవులనుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు నల్లగొండ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి విజేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవ, విశిష్ట వైద్య సేవలు, విద్యాబోధన, రచనారంగం, ఫైన్ ఆర్ట్స్ థియేటర్, క్రీడారంగంలో పదేళ్ల పైబడి సేవలు అందించిన క్రైస్తవులు, క్రైస్తవ సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను డిసెంబరు 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు నల్లగొండలోని జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో అందజేయాలని, వివరాలకు 94407 27085 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

శివకేశవులకు సంప్రదాయ పూజలు



అభిషేకం చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : శివకేశవులకు నిలయమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం నిత్య పూజలు కొనసాగాయి. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో పాటు కార్తీకమాసం చివరి వారం కావడంతో యాదగిరి కొండపై ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో రుద్రాభిషేకం, బిల్వార్చన చేశారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలు ఆగమశాస్త్రం ప్రకారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతం సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు నిజాభిషేకం, తులసీపత్రాలతో అర్చన చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపం, ముఖ మండపంలో శ్రీవరదరాజ నారసింహహోమం, నిత్యకల్యాణం, జోడు సేవత్సం తదితర పూజలు నిర్వహించారు.

వసతిలో వణుకు..

ఆలేరులోని ఎస్సీ హాస్టల్‌లో ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లను కప్పుకున్న పలువురు విద్యార్థులు



ఆలేరులోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో 33 మంది విద్యార్థులకు గాను 16 మంది మాత్రమే ఉన్నారు. మంచినీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంకుకు మూత లేదు. కొందరు విద్యార్థులకు దుప్పట్లు ఇచ్చారు. ఒక్కో దుప్పటిని ఇద్దరు విద్యార్థులు కప్పుకుంటున్నారు. కొందరి దుప్పట్లు చిరిగిపోయి ఉన్నాయి. గదుల్లో లైట్లు లేవు. మరుగుదొడ్లు, హాస్టల్ ఆవరణ అపరిశుభ్రంగా ఉన్నాయి. వార్డెన్ అందుబాటులో ఉండడం లేదని తెలిసింది.

సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. గదులకు కిటికీలు, తలుపులు సరిగ్గా లేక, చలిని తట్టుకునే దుప్పట్లు ఇవ్వక, గీజర్లు ఏర్పాటు చేయక చన్నీటి స్నానం చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటితో పాటు నాణ్యత లేని భోజనం, బాత్రూంలు, టాయిలెట్ల నిర్వహణలేమితో అవస్థలు పడుతున్నట్లు సాక్షి విజిట్‌లో వెలుగుచూశాయి.

హాస్టళ్లలో సౌకర్యాల కొరత.. చలికి విద్యార్థులు గజగజ

- కొందరికే దుప్పట్లు.. అవి కూడా నాణ్యతలేనివి పంపిణీ
- గీజర్లు ఉన్నా నిరుపయోగం
- గదులకు విరిగిపోయిన తలుపులు, కిటికీలు
- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు
- హాస్టళ్ల పరిసరాలు అధ్వానం
- భోజనమూ నాసిరకమే..



భువనగిరి ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థులకు పంపిణీ చేసిన నాణ్యతలేని దుప్పట్లు



చలినుంచి కాపాడుకోవడానికి అడ్డంగా దుప్పటి కట్టిన విద్యార్థులు

భువనగిరిలోని గిరిజన బాలుర వసతి గృహంలో 50 మంది విద్యార్థులు ఉన్నారు. మంచాలపై బెడ్లు లేకపోవడంతో విద్యార్థులు దుప్పట్లు పరుచుకుంటున్నారు. అంతేకాకుండా నాణ్యతలేని దుప్పట్లు పంపిణీ చేశారు. ఇవి చలిని తట్టుకోలేకపోవడంతో కొందరు విద్యార్థులు ఇంటి నుంచి బ్లాంకెట్స్, చద్దర్లు తెచ్చుకున్నారు. ఉదయం చన్నీళ్లతోనే స్నానం చేస్తున్నారు. వంటలు చేయడానికి ప్రత్యేకంగా కిచెన్ లేకపోవడంతో డైనింగ్ హాల్ వండుతున్నారు. దీంతో విద్యార్థులు కింద కూర్చుని భోజనం చేస్తున్నారు. ఇంచార్జ్ వార్డెన్‌తో నెట్టుకొస్తున్నారు.

భువనగిరిలోని తారకరామానగర్ బీసీ హాస్టల్‌లో రికార్డుల పరంగా 75 మంది విద్యార్థులు ఉన్నారు. కానీ, హాస్టల్‌లో 40 మందికి మించి ఉండడం లేదు. విద్యార్థులకు దుప్పట్లు మాత్రమే ఇచ్చారు. దోమ తెరలు, స్వెట్టర్లు ఇవ్వలేదు.

వసతిగృహాలు, విద్యార్థులు ఇలా..

శాఖ	హాస్టళ్లు	విద్యార్థుల సంఖ్య
ఎస్సీ	21	1,600
ఎస్సీగురుకుల	08	4,960
బీసీ	19	1,100
ఎస్టీ	08	823
మైనార్టీ	03	840

సాక్షి, యాదాద్రి : జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ.. ఇలా అన్ని రకాల ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులు చలికి గజగజ వణికిపోతున్నారు. చలికాలం మొదలైనా చాలా చోట్ల విద్యార్థులకు దుప్పట్లు అందజేయలేదు. గత ఏడాది ఇచ్చినవాటితోనే సరిపెట్టుకున్నారు. కొందరు ఇంటినుంచి తెచ్చుకున్న దుప్పట్లను కప్పుకుంటున్నారు. ఒక్కో దుప్పటిని ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు కప్పుకుంటున్నారు. అదే విధంగా పలు హాస్టళ్లలో నేటికీ గీజర్లు ఏర్పాటు చేయలేదు. ఉన్న చోట పని చేయకపోవడంతో విద్యార్థులు చన్నీటితోనే స్నానం చేస్తున్నారు. మరమ్మతులు చేయించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యార్థులు వాపోయారు. వీటితో పాటు మంచాలపై పూర్తి స్థాయిలో పరుపులు లేకపోవడంతో విద్యార్థులు దుప్పట్లు పరుచుకుని నిద్రిస్తున్నారు. నిధులలేమితో కొత్తవి కొనుగోలు చేయలేకపోతున్నారు.

అమలుకాని మెనూ..

వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాల్సి ఉండగా ఎక్కడా పూర్తిస్థాయిలో అమలు కావడం ఏదు. నాసిరకం సరుకులు, కూరగాయలను వండిపెడుతున్నారు. అరటిపండ్లు, స్నాక్స్, గుడ్డ క్రమంతప్పకుండా ఇవ్వడం లేదన్న ఆరోపణలున్నాయి. దోమ తెరలు, స్వెట్టర్లు పంపిణీ చేయలేదు. విద్యార్థుల ఆరోగ్యంపైనా వార్డెన్లు అశ్రద్ధ చూపుతున్నారని, వైద్య పరీక్షలు చేయించడం లేదని తెలిసింది. ఇక చాలా చోట్ల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాత్రూంలు, మరుగుదొడ్లు లేవు. ఉన్నవి కూడా తలుపులు సరిగా లేకపోవడం, నిర్వహణ లేమితో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హాస్టళ్ల పరిసరాలు పిచ్చిమొక్కలు, కంపచెట్లతో నిండిపోయాయి. గదుల్లోకి కీటకాలు, పాములు వస్తున్నాయని విద్యార్థులు వాపోయారు.

హాస్టళ్లలో ఉండని వార్డెన్లు!

వార్డెన్లు తప్పనిసరిగా హాస్టళ్లలోనే ఉంటూ విద్యార్థుల యోగక్షేమాలు చూస్తుండాలి. భోజనంపై పర్యవేక్షణ ఉంచాలి. కానీ, ఏ ఒక్కరూ హాస్టళ్లలో ఉండకుండా సిబ్బందిపై వదిలేస్తున్నారు. విద్యార్థులకు ఏదైనా సమస్య వచ్చినా అందుబాటులోకి రావడం లేదు. గత ఏడాది భువనగిరి ఎస్సీ వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. అలాగే భువనగిరి ఎస్సీ గురుకుల పాఠశాలలో కలుషిత నీటి కారణంగా ఓ విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇలా పలు చోట్ల విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నా వార్డెన్లకు పట్టింపు ఉండడం లేదు.

సమస్యలు ఆలకించి.. భరోసా ఇచ్చి

- ప్రజావాణిలో వినతులు స్వీకరించిన కలెక్టర్
- న్యాయం చేస్తానని బాధితులకు హామీ
- వివిధ సమస్యలపై 30 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 30 మందికి పైగా బాధితులు వచ్చారు. కలెక్టర్ హనుమంతరావు వారినుంచి వినతులు స్వీకరించారు. సమస్యలు ఆలకించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 30 అర్జీలు రాగా వాటిని పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత శాఖలకు రెఫర్ చేశారు. వినతుల్లో సగానికి పైగా రెవెన్యూ సమస్యలకు సంబంధించినవే ఉన్నట్లు తెలిపారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్డీఓ నాగిరెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్ ప్రసాద్, జిల్లా అధికారులు ప్రజావాణిలో పాల్గొని బాధితుల నుంచి వినతులు స్వీకరించారు.

- ఆసరా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుని రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నానని, మీరైనా సమస్య పరిష్కరించాలంటూ రాజాపేట మండలం బేగంపేట గ్రామానికి చెందిన ఎలయ్య కలెక్టర్‌ను వేడుకున్నారు.
- చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం కోఆపరేటివ్ టెనెంట్ ఫార్మింగ్ సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలని సొసైటీ ప్రతినిధులు విన్నవించారు. సొసైటీకి 2023 నవంబర్ నెలలోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా జాప్యం చేస్తున్నారని, కమిటీ లేకపోవడంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, వెంటనే ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మీరైనా మా సమస్య తీర్చండి



కుమారులతో కలిసి ప్రజావాణికి వచ్చిన పద్మ

నక్సలైట్‌గా ఉన్న నా భర్త కట్టెల రామకృష్ణ 2004లో ప్రభుత్వానికి లొంగిపోయాడు. పునరావాసం కింద మా కుటుంబానికి 300 గజాల ఇంటి జాగా, ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఇస్తున్నట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. కానీ, 20 ఏళ్లు గడిచినా ఉత్తర్వులు అమలు చేయలేదు. నా భర్త అధికారుల చుట్టూ తిరిగాడు. 2017లో కలెక్టరేట్‌కు వచ్చి ప్రజావాణిలో వినతిపత్రం అందజేసినా ఫలితం లేకపోయింది. 2019లో నా భర్త రామకృష్ణ గుండెపోటుతో మృతిచెందాడు. అప్పటినుంచి నేను మానసికంగా కుంగిపోయి అనారోగ్యానికి గురయ్యా. నాకు కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పోషణ భారంగా మారింది. పైగా మాది కులంతార వివాహం. నా అమ్మగారు ఆంధ్రప్రదేశ్‌లో ఉంటారు. ప్రస్తుతం కూలి పనులకు వెళ్తూ, పిల్లలను పోషించుకుంటూ సర్వేల్‌లో గ్రామంలో ఉంటున్నాం. పునరావాసం కింద ప్రకటించిన సహాయాన్ని వర్తింపజేయాలని సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గ్రామానికి చెందిన మాజీ నక్సలైట్ భార్య పద్మ ప్రజావాణికి వచ్చి కలెక్టర్‌ను వేడుకుంది.

డేటా ఎంట్రీలో తప్పులకు తావుండొద్దు

- కలెక్టర్ హనుమంతరావు



సమగ్ర కుటుంబ సర్వే వివరాల డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న కలెక్టర్

భువనగిరి రూరల్ : సమగ్ర కుటుంబ సర్వే వివరాల డేటా ఎంట్రీలో తప్పులకు తావులేకుండా నమోదు చేయాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. భువనగిరిలోని ఎంపీడీఓ కార్యాలయంలో కొనసాగుతున్న డేటా ఎంట్రీని సోమవారం ఆయన పరిశీలించి ఆపరేటర్లకు సూచనలు చేశారు. ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసేటప్పుడు ఎన్యుమరేటర్లు తప్పనిసరిగా దగ్గర ఉండాలన్నారు. నమోదు చేసే వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తుండాలని పేర్కొన్నారు. సకాలంలో ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ దినకర్ ఉన్నారు.

కేటీఆర్‌కు బీఆర్‌ఎస్ శ్రేణుల స్వాగతం



పోచంపల్లి మండల శివారులో కొత్తగూడెం క్రాస్‌రోడ్డు వద్ద కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు



చౌటుప్పల్‌లో స్వాగతం పలుకుతున్న కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కార్యకర్తలు

భూదాన్‌పోచంపల్లి : మహబూబాబాద్‌లో మహాధర్నాకు వెళ్తున్న బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సోమవారం పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. భూదాన్‌పోచంపల్లి మండల శివారులోని కొత్తగూడెం క్రాస్‌రోడ్డు వద్ద మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, రవీంద్ర నాయక్, బూడిద భిక్షమయ్యగౌడ్, జెడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, కొలుపుల అమరేందర్, మాజీ ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి, మున్సిపల్‌వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పగిళ్ల సుధాకర్‌రెడ్డి, ముత్యాల మహిపాల్‌రెడ్డి, చిల్వేరు బాలనర్సింహ, మాధవరెడ్డి, మందాడి మహిపాల్‌రెడ్డి, గుర్రం బాల్‌రెడ్డి, సార బాలయ్యగౌడ్ తదితరులు స్వాగతం పలికారు. కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. కేటీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి, సీఎం, సీఎం అంటూ నినాదాలతో హోరెత్తించారు. కాగా కేటీఆర్ కారు దిగి కార్యకర్తలకు అభివాదం చేసి ముందుకు వెళ్లిపోయారు.

చౌటుప్పల్‌లో

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు కేటీఆర్‌కు స్వాగతం పలికారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు. రాష్ట్ర అభివృద్ధికి కేటీఆర్ నాయకత్వం కావాలని ఆయన పేర్కొన్నారు. స్వాగతం పలికిన వారిలో మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్, మార్కెట్ మాజీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఢీల్లీ మాధవరెడ్డి, తాడూరి పరమేష్, గుండెబోయిన వెంకటేష్, బోరెం ప్రకాష్‌రెడ్డి, మునుకుంట్ల సత్యనారాయణ, ఉడుగు మల్లేష్, సుర్వి మల్లేష్, కొత్త పర్వతాలు, చిన్నం బాలరాజు, ముప్పిడి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అవగాహనతోనే కుష్టు నివారణ

- తగ్గుముఖం పడుతున్న కేసులు
- 2027 నాటికి కుష్టురహిత జిల్లాగా మార్చాలన్నది లక్ష్యం
- సత్ఫలితమిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ చర్యలు
- వ్యాధిగ్రస్తులకు ఉచిత చికిత్స, మందులు పంపిణీ, పింఛన్ అందజేత
- సర్వేకు సన్నద్ధమవుతున్న అధికారులు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కుష్టు వ్యాధి నివారణ అధికారి సాయిశోభ

భువనగిరి : జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులు క్రమంగా తగ్గుతున్నారు. 2022లో 42 మంది ఉండగా 2024 ఆగస్టు నాటికి ఆ సంఖ్య 18కి తగ్గింది. 2027 నాటికి కుష్టురహిత జిల్లాగా మార్చాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో భాగంగా జాతీయ ఆరోగ్య మిషన్ చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి.

తగ్గుతున్న బాధితులు

జిల్లాలో ఎల్‌సీడీసీ (లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్) ద్వారా గుర్తించిన కుష్టు బాధితులకు ప్రత్యేక చికిత్స అందించడం ద్వారా వ్యాధి గ్రస్తుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. 2022 నుంచి 2024 ఆగస్టు నాటికి జిల్లాలో 92 మంది వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గుర్తించారు. అందులో 68 మందికి వ్యాధి నయం కాగా.. ప్రస్తుతం 24 మంది చికిత్స పొందుతున్నారు.

చేపడుతున్న చర్యలు ఇవీ..

- జాతీయ ఆరోగ్య మిషన్ సర్వేలో గుర్తించిన కుష్టు బాధితులకు వ్యాధి తీవ్రతను బట్టి ఉచితంగా చికిత్స అందజేస్తున్నారు.
- శాశ్వత అంగవైకల్యానికి గురికాకుండా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి, కూకట్‌పల్లిలోని శివానంద ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు.
- శస్త్ర చికిత్స అనంతరం వారికి పౌష్టికాహారంతో పాటు ఇతర అవసరాల కోసం రూ.12 వేల ఆర్థిక సహాయం అందజేస్తున్నారు.
- ప్రభుత్వ పరంగా పింఛన్లతో పాటు ఎంసీఆర్, మందుల కిట్లు ఇస్తున్నారు.

సర్వేకు సన్నాహాలు

జిల్లాలో 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో ఇంటింటి సర్వే చేయడానికి 704 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఒక ఆశా కార్యకర్త, ఒక వలంటీర్ ఉంటారు. ఈ ఏడాది 2024 మార్చిలో ఇంటింటి సర్వే చేశారు. తాజాగా డిసెంబర్ 2నుంచి 15వ తేదీ వరకు 14 రోజుల పాటు సర్వే చేయనున్నారు. ఇందుకోసం అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి గతంలో గుర్తించిన కుష్టువ్యాధి గ్రస్తుల ఆరోగ్యంపై వివరాలు సేకరించడంతో పాటు సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు.

డిసెంబర్ 2 నుంచి సర్వే చేస్తాం

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు డిసెంబర్ 2వ తేదీనుంచి సర్వే చేపట్టనున్నాం. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సూచనలు చేశాం. సర్వే కోసం 704 బృందాలు ఏర్పాటు చేశాం. గుర్తించిన వ్యాధిగ్రస్తులకు ఉచితంగా చికిత్స, ఇతర సదుపాయాలు కల్పిస్తాం.

–సాయిశోభ, జిల్లా కుష్టు వ్యాధి నివారణ అధికారి

ఆన్‌లైన్ నమోదు పక్కాగా ఉండాలి

- సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ పరిశీలకుడు రవిచంద్ర



భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు రవిచంద్ర

భువనగిరిటౌన్ : సమగ్ర కుటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు పక్కాగా ఉండాలని, పొరపాట్లకు ఆస్కారం ఉండవద్దని డేటీ ఎంట్రీ రాష్ట్ర పరిశీలకుడు రవిచంద్ర ఆపరేటర్లకు సూచించారు. భువనగిరి ఎంపీడీఓ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, సిద్ధార్థ ఐటీఐ, బీబీనగర్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌లో కొనసాగుతున్న డేటా ఎంట్రీని సోమవారం అదనపు కలెక్టర్ గంగాధర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఆన్‌లైన్ నమోదులో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం మరోసారి వివరాలను క్రాస్ చేసుకోవాలన్నారు. తప్పులు దొర్లకుండా ఎన్యూమరేటర్లు దగ్గర ఉండి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, శ్యాముల్, ఇతర అధికారులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి : జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ సాయికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిల్ప హోటల్ నుంచి గాంధీ పార్కు వరకు 33 కేవీ లైన్ టవర్లకు లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా తాతానగర్, శిల్ప హోటల్ వెనుక వైపు, ఎల్‌ఐసీ కార్యాలయం, పట్టణ పోలీస్‌స్టేషన్, జిల్లా కోర్టు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్వీ కాంప్లెక్స్, చర్చి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు వాణిజ్య సముదాయాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



క్లుప్తంగా

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం జరగాల్సిన డిగ్రీ 3, 5వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాయిదా వేసిన పరీక్షలను డిసెంబరు 12న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 28 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు యథావిధిగా జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

బాలికపై లైంగికదాడి

ఆత్మకూరు(ఎం): బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటన ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేటలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన యువకుడు చొరబడి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక జరిగిన విషయం కుటుంబ సభ్యులకు తెలుపడంతో వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లైంగికదాడికి పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్. కృష్ణయ్య తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


కోటయ్య

త్రిపురారం: నిడమనూరు మండలం నారమ్మగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. సోమవారం నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నారమ్మగూడెం గ్రామాని చెందిన బొడ్డుపల్లి కోటయ్య(42) మిర్యాలగూడ పట్టణంలో ఓ మిల్లు లీజుకు తీసుకొని జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 23వ తేదీ ఉదయం మిల్లు వద్దకు వెళ్తున్నానని భార్య నిర్మలకు చెప్పి వెళ్లాడు. అదే రోజు మధ్యాహ్నం నిర్మల మిల్లు వద్దకు వెళ్లి చూడగా మిల్లు మూసి ఉంది. అప్పటి నుంచి ఎంత వెతికినా కోటయ్య ఆచూకీ లభించలేదు. సోమవారం నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొర్రెల మంద, కాపరిపై కుక్కల దాడి

అర్వపల్లి: మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామంలో సోమవారం వీధి కుక్కలు గొర్రెల మందతో పాటు గొర్రెల కాపరిపై దాడి చేసి గాయపర్చాయి. రామన్నగూడెం గ్రామానికి చెందిన వజ్జె వినయ్ తమ గొర్రెలను కొత్తగూడెం గ్రామ శివారులో మేపుతుండగా వీధి కుక్కలు ఒక్కసారిగా వినయ్‌పై దాడిచేసి గాయపర్చాయి. అనంతరం గొర్రెల మందపై దాడి చేయగా.. ఒక గొర్రె అక్కడికక్కడే చనిపోయింది. మరికొన్ని తీవ్రంగా గాయపడ్డాయి. అనంతరం వీధి కుక్కలు దూదేకుల కుంట వద్ద, గ్రామ శివారులోని వీకే గార్డెన్ సమీపంలో మేస్తున్న గొర్రెలపై కూడా దాడి చేయగా అందులో కొన్ని గొర్రెలు గాయపడ్డాయి. రూ.20వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

నిప్పంటుకొని ధాన్యం దగ్ధం

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని చిల్లాపురం గ్రామంలో దుబ్బాక వెంకటయ్యకు చెందిన ధాన్యం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వెంకటయ్య తన వ్యవసాయ బావి వద్ద ధాన్యం ఆరబెట్టగా.. సోమవారం మంటలు అంటుకొని సుమారు 30క్వింటాళ్ల ధాన్యం దగ్ధమైంది. వెంకటయ్య కుటుంబ సభ్యులు గమనించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు.


ధాన్యానికి అంటుకున్న మంటలను ఆర్పుతున్న వెంకటయ్య కుటుంబ సభ్యులు

సాక్షి క్లాసిఫైడ్స్
Education
■ Admission for guidence ఇంటర్, డిగ్రీ, పీజీ, B.Tech, LLB, B.Sc, అగ్రి, GNM, BHMS, BAMS, BNYS, BPT, D.ఫా, B.ఫా. 9494903629, 7660043034 కొన్ని సీట్లు మాత్రమే. [W-1239947]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలుచదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ ఎకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాగులో శిక్షణ.. రైతులకు అవగాహన

- కేవీకేలో శిక్షణ పొందుతూ క్షేత్రస్థాయిలో రైతులతో మమేకం
- వ్యవసాయ పద్ధతుల గురించి అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థినులు


విద్యార్థినులకు వ్యవసాయం గురించి వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్త

గరిడేపల్లి: అగ్రికల్చర్ డిగ్రీ చదువుతున్న విద్యార్థినులు గ్రామాల్లో పర్యటించి రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ పొందుతున్నారు. అక్టోబర్ 16వ తేదీన 58మంది విద్యార్థినులు గడ్డిపల్లి కేవీకేకు వచ్చారు. వీరికి పది రోజులకు ఒకసారి కేవీకేలో వ్యవసాయ పద్ధతులపై శిక్షణనందిస్తూ వారికి తెలిసిన అంశాలను క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించేలా చూస్తున్నారు. మొత్తం 58మంది విద్యార్థులు 8 బ్యాచ్‌లుగా ఏర్పడి 90రోజుల పాటు కేవీకే పరిధిలోని దత్తత గ్రామాలైన గడ్డిపల్లి, మర్రికుంట, పొనుగోడు, దూపహాడ్, కీతవారిగూడెం, గరిడేపల్లి విద్యార్థినులు పర్యటించి భూసార పరీక్షలు, ఎరువుల వాడకం, చీడపీడలు, కలుపు నివారణ, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, జీవ ఎరువుల తయారీ, నీటి యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గ్రామ కూడళ్ల వద్ద గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక కార్యక్రమం ద్వారా గ్రామ జనాభా, పంటల విధానం, రైతుల ఆర్థిక స్థితిగతులు, గ్రామ భౌగోళిక స్వరూపం వంటి అంశాలపై చిత్రపటాలతో అవగాహన కల్పిస్తూ ప్రజలతో మమేకం అవుతున్నారు.

ప్రతి ఏటా నిర్వహిస్తున్నాం



మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులకు కేవీకేలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విద్యార్థినులు 90రోజుల పాటు రైతులతో మమేకమవుతారు. రైతులకు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ విద్యార్థినులు కూడా రైతుల నుంచి పలు అంశాల గురించి క్షేత్రస్థాయిలో తెలుసుకుంటున్నారు.

– ఆకుల నరేష్, కేవీకే ప్రోగ్రాం అసిస్టెంట్

ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాం



రైతులు పొలాల్లో మోతాదుకు మించి ఎరువులు వాడుతున్నట్లు గుర్తించాం. ఎరువుల వాడకం చాలా ప్రమాదకరమని రైతులకు అవగాహన కల్పించాం. అధిక ఎరువుల వాడకం వలన భూసారం తగ్గుతుందని ప్రజల ఆరోగ్యం తీవ్ర నష్టం జరుగుతుందని తెలియజేశాం. అధిక ఎరువులు వాడకుండా భూసారం, దిగుబడులు ఎలా పెంచుకోవాలో అవగాహన కల్పించాం.

– పి. దీక్షిత, అగ్రికల్చర్ విద్యార్థిని

జీవ ఎరువుల గురించి తెలియజేశాం



జీవ ఎరువులను ఎలా తయారు చేసుకోవాలి, వాటిని ఏవిధంగా వాడుకుని అధిక దిగుబడులు సాధించాలి అనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించాం. జీవామృతం, ఘన జీవామృతం తయారీ గురించి స్వయంగా రైతులకు వివరించాం. వీటి వలన కలిగే లాభాల గురించి తెలియజేశాం.

– గొట్టం జస్మిత, బీఎస్సీ అగ్రికల్చర్, మల్లారెడ్డి యూనివర్సిటీ

అధిక దిగుబడుల గురించి వివరించాం



వ్యవసాయంలో అధిక దిగుడులు ఎలా సాధించాలి అనే అంశంపై క్షేత్రస్థాయిలో రైతులకు తెలియజేశాం. భూసార పరీక్షలు, విత్తనశుద్ధి వంటివి సక్రమంగా చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఎలా సాధించవచ్చో రైతులకు వివరించాలి. మేము కూడా రైతులు అవలంబిస్తున్న వ్యవసాయ పద్ధతుల గురించి తెలుసుకున్నాం.

– కె. కీర్తి, బీఎస్సీ అగ్రికల్చర్

90 రోజులు రైతులతోనే ఉంటాం



90రోజుల పాటు గ్రామాల్లో రైతులతో మమేకమై మేము నేర్చుకున్న వ్యవసాయ సంబంధిత అంశాల గురించి అవగాహన కల్పిస్తాం. గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక కార్యక్రమం ద్వారా గ్రామీణ స్థితిగతులు, జనాభా, రైతుల ఆర్థిక స్థితిగతులు వంటి అంశాలపై ప్రభుత్వ కార్యాలయంలో అవగాహన కల్పించాం. రైతులతో పూర్తిగా మమేకమై ముందుకు సాగుతున్నాం.

– కె. భవ్యారెడ్డి, అగ్రికల్చర్ విద్యార్థిని

రోడ్డు ప్రమాదంలో జార్ఖండ్ వాసి మృతి


పింటూసావ్ (ఫైల్)

అడ్డగూడూరు: జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన యువకుడు బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి అడ్డగూడూరు మండల కేంద్రం శివారులో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలంలోని గురజాల నుంచి చౌల్లరామారం మధ్యన చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల్లో జార్ఖండ్‌లోని కోడర్‌మా జిల్లాకు చెందిన పింటూసావ్(30) హిటాచీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పింటూసావ్ ఆదివారం రాత్రి 9గంటల ప్రాంతంలో అడ్డగూడూరు మండల కేంద్రలో భోజనం చేసి తిరిగి హిటాచీ వద్దకు బైక్‌పై వెళ్తుండగా.. అడ్డగూడూరు మండల కేంద్రం శివారులో బైక్ అదుపుతప్పడంతో రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. సోమవారం తెల్లవారుజామున వ్యవసాయ పనుల కోసం వెళ్తున్న రైతులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరికి గాయాలు

రామన్నపేట: బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామానికి చెందిన కొండకింది శేఖర్‌రెడ్డి సోమవారం బైక్‌పై రామన్నపేట నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా.. రామన్నపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్‌రెడ్డి కాలు విరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. మల్లయ్య తెలిపారు.

లారీ ఢీకొని..

వేములపల్లి (మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామ శివారులో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మాడ్గులపల్లి మండలం అభంగాపురం గ్రామానికి చెందిన మౌలానా మాడ్గులపల్లి మండల కేంద్రంలో కారు మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. కుక్కడం గ్రామ శివారులో పెద్దదేవులపల్లి నుంచి కుక్కడం వైపు వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మౌలానా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌కు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

వలిగొండ : వ్యవసాయ బావి వద్ద పశువులకు గడ్డి వేయడానికి వెళ్లిన రైతు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన వలిగొండ మండలం గోపరాజుపల్లిలో సోమవారం జరిగింది. గోపరాజుపల్లికి చెందిన రైతు గాజుల వెంకటేశం తన పశువులకు గడ్డి వేయడానికి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి నురగలు కక్కుతూ పడిపోయాడు. చుట్టుపక్కల రైతులు గమనించి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం అతడిని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి ఛాతిపై పాము గాట్లను గుర్తించిన వైద్యులు పాముకాటుతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. పోస్టుమార్టం చేస్తే గాని మృతికి గల కారణాలు తెలుపలేమని వైద్యులు పేర్కొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


నాగరాజు (ఫైల్)

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలోని పాపిరెడ్డి కాలనీకి చెందిన సిగపట్ల నాగరాజు(45) సోమవారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నాగరాజు ఎస్ఎల్‌బీసీ గుర్రంపోడు డివిజన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు చెప్పిన మాట వినడం లేదని మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్న రైతులు


టిప్పర్లు, ప్రొక్లెయిన్‌ను వదిలేసి వెళ్లిన వ్యాపారులు


రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

- ప్రభుత్వ భూమిలో మట్టిని తవ్వి వెంచర్లకు అమ్ముకుంటున్నారని ఆరోపణ
- అధికారులకు సమాచారం ఇవ్వడంతో టిప్పర్లను వదిలేసి పరారైన వ్యాపారులు

కోదాడరూరల్: కోదాడ మండలం కాపుగల్లు రెవెన్యూ పరిధిలోని రెడ్లకుంట శివారులో ఆర్‌కే మేజర్ 7–ఎల్ కాల్వ వద్ద సర్వే నంబర్ 292లో గల ప్రభుత్వ భూమిలో కొందరు వ్యాపారులు మట్టిని తవ్వి కోదాడలోని వెంచర్లకు అమ్ముకుంటున్నారు. మట్టి తవ్వొద్దని చెప్పినా వినకుండా అలాగే తరలిస్తుండగా ఆగ్రహించిన రెడ్లకుంట రైతులు సోమవారం టిప్పర్లు, ప్రొక్లెయిన్‌లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, స్థానికులు మాట్లాడుతూ.. కొందరు వ్యాపారులు ప్రభుత్వ భూమి నుంచి ఇష్టానుసారంగా 10 నుంచి 20 అడుగుల మేర వరకు మట్టిని తవ్వుతున్నారని తెలిపారు. అడ్డుకుంటే తమ పైనే దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. పొలాను ఆనుకొని మట్టిని లోతుగా తవ్వడంతో మడుల్లో నీరు నిలవక అనేక ఇబ్బందులు పడతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 20 రోజుల కిందట నేరుగా ఆర్‌కే మేజర్ క్వాలను పూడ్చి మట్టిని తరలించారని దీంతో నీరు పొంగి పంట పొలాలపై పడడంతో రైతులు ఎన్ఎస్‌పీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు కాల్వలో మట్టిని తొలగించారన్నారు. ఏడాదిన్నర కిందట ఇదే విధంగా మట్టిని తరలిస్తుండడంతో మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేయగా.. వారు ప్రొక్లెయిన్‌ను సీజ్ చేశారని తెలిపారు. సోమవారం టిప్పర్లు, ప్రొక్లెయిన్‌లను రైతులు అడ్డుకుని అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వస్తున్న విషయాన్ని తెలుసుకుని వాహనాలను అక్కడే వదిలేసి పరారయ్యారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని అక్కడకు వచ్చిన రెవెన్యూ అధికారులకు రైతులు ఫిర్యాదు చేశారు.

డ్రమ్ సీడర్ పద్ధతితో అధిక దిగుబడులు

పెన్‌పహాడ్: డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు చేస్తే రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని కేవీకే శాస్త్రవేత్త ఎ. కిరణ్, ప్రాణాధార సంస్థ శాస్త్రవేత్త కె. పుండరీకాంక్షుడులు అన్నారు. సోమవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని దూపహాడ్, లింగాల గ్రామాల్లో డ్రమ్ సీడర్ విధానం ద్వారా పండించిన వరి పంటను వారు పరిశీలించారు. అనంతరం వరిలో డ్రమ్ సీడర్ విధానం గురించి రైతులకు వివరించారు. బూమ్ స్ప్రేయర్ ద్వారా కలుపు మందులు, రసాయనాలు పిచికారీ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు అరవింద్, వీరయ్య, బచ్చు శ్రీను, అంజయ్య, సత్యనారాయణ, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.


డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగుచేసిన వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు


యాదగిరిగుట్టలో సత్యనారాయణస్వామి వ్రతాలు జరిపిస్తున్న భక్తులు

- కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో కిటకిటలాడిన ఆలయ పరిసరాలు

యాదగిరిగుట్ట: కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు అధికంగా వచ్చారు. ఉదయం నుంచే కొండ దిగువన ఉన్న వ్రత మండపంలో సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. కొండ పైన ధర్మ దర్శనానికి రెండున్నర గంటలు, వీఐపీ దర్శనానికి 45నిమిషాల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. స్వామి వారిని 30వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.44,70,794 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.


చెర్వుగట్టులో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చెర్వుగట్టులో ప్రత్యేక పూజలు

నార్కట్‌పల్లి: కార్తీక మాసంలో చివరి సోమవారం కావడంతో నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అభిషేకాలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. గట్టు పైన, ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జాం కావడంతో భక్తులు ఇబ్బందులు పడారు. ఆయా పూజల్లో ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సీనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


నార్కట్‌పల్లి: చెర్వుగట్టులో రామలింగేశ్వరస్వామి దర్శనానికి బారులుదీరిన భక్తులు

పత్తి మిల్లులో అగ్నిప్రమాదం

- రైతుల నుంచి సేకరించిన 2వేల క్వింటాళ్ల పత్తి దగ్ధం

ఆత్మకూరు(ఎం): షార్ట్ సర్క్యూట్ కారణంగా పత్తి మిల్లులో మంటలు చెలరేగి పత్తి దగ్ధమైంది. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో సోమవారం ఉదయం జరిగింది. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని శ్రీసిద్దేశ్వర కాటన్ మిల్లులో ఈ నెల 4వ తేదీన సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పటి వరకు రైతుల నుంచి సుమారు 30వేల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. సీసీఐ కేంద్రంలో పత్తి నిల్వ చేసిన షెడ్డు కింద షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పత్తిపై పడ్డాయి. దీంతో దట్టమైన పొగలు ఏర్పడి మంటలు వ్యాపించాయి. అక్కడే పనిచేసే కూలీలు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో మోత్కూరు నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను పూర్తిగా ఆర్పేశారు. ఈ ఘటనలో 2వేల క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ వి. రవికుమార్, ఎస్ఐ ఎస్. కృష్ణయ్య పరిశీలించారు.


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న ముగ్గురి రిమాండ్

తిప్పర్తి: అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న ముగ్గురిని సోమవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దసూరారం గ్రామానికి చెందిన కర్ర రాములమ్మకు 2.37 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో నుంచి 33గుంటల భూమిని అమ్మకానికి పెట్టగా.. అదే గ్రామానికి చెందిన రాములమ్మ వరసకు అన్న అయిన తల్లమల్ల హుస్సేన్, అతడి కుమారులు రాజు, విజయ్ కొనుగోలు చేయడానికి అగ్రిమెంట్ చేసుకున్నారు. గత నెల 17వ తేదీన 33 గుంటలకు మాత్రమే డబ్బులు చెల్లించి మోసపూరితంగా మొత్తం 2.37 ఎకరాల భూమిని వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రాములమ్మకు చదువు రాకపోవడంతో ఆమె సమీప బంధువు పాసుపుస్తకం పరిశీలించగా.. భూమి మొత్తం రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలియడంతో ఈ నెల 18న రాములమ్మ తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తిప్పర్తి ఎస్ఐ సాయిప్రశాంత్ విచారణ చేసి హుస్సేన్, అతడి కుమారులు రాజు, విజయ్‌ను రిమాండ్‌కు తరలించారు.

తగ్గుతున్న ఉష్ణోగ్రతతో కోళ్లకు ప్రమాదం

- ముందస్తు టీకాలు వేయించాలని సూచిస్తున్న పశువైద్యాధికారి

పాడిపంట

పెద్దవూర: ప్రస్తుతం చలి తీవ్రంగా ఉంది. తగ్గుతున్న ఉష్ణోగ్రతలతో కోళ్లకు ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా లేయర్, బ్రాయిలర్ ఫాంలు నెలకొల్పిన వారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే కోళ్లు అనేక వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని పెద్దవూర మండల పశువైద్యాధికారి డాక్టర్ పిట్టల చంద్రబాబు పేర్కొన్నారు. చలికాలంలో కోళ్లఫాంల నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే.. కోళ్ల పెరుగుదల్లో ఉష్ణోగ్రత కీలక పాత్ర పోషిస్తుంది. దట్టంగా కమ్మే పొగ మంచు, చలిగాలులు, ఉష్ణోగ్రత, తేమశాతం, ముఖ్యంగా రాత్రి సమయాల్లో నిర్దిష్ట ప్రమాణాల ప్రకారం ఉండడం ద్వారా మాత్రమే అధిక ఉత్పత్తి సాధించవచ్చు. దీనికోసం కోళ్ల ఫారాల చుట్టూ ఎత్తుగా ఉండే చెట్లు పెంచితే షెడ్లలోకి చలిగాలులు అంతగా రావు. ఉదయం వేళ సూర్యకిరణాలు పడేలా చూసుకుంటే ఎదుగుదల బాగుంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- గదిలో ఇన్‌ఫ్రారెడ్ దీపాలు ఏర్పాటు చేయడం ద్వారా గదిలో ఉష్ణోగ్రతను తగినంత స్థాయిలో ఉంచవచ్చు.



- షెడ్డులో అధిక సమయం విద్యుత్ దీపాలు అమర్చి కృత్రిమ వెలుతురు ఉండేలా చూడాలి.
- కోళ్లు ఒకేదగ్గర గుమిగూడి ఉంటే చలికి వణికిపోతున్నట్లు గమనించి వాటికి వెచ్చగా ఉండేలా విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలి.
- ఒకే దగ్గర ఉండటంతో కోళ్లలో ఎదుగుదల లోపిస్తుంది. సాధ్యమైనంత వరకు ఇరుకు గదులు లేకుండా విశాలంగా ఉండేలా చూసుకోవాలి.

వ్యాధులు.. నివారణ

- చలికాలంలో తేమ, ఉష్ణోగ్రత తక్కువగా ఉండటం వల్ల శిలీంద్రాలు ఎక్కువగా పెరుగుతాయి. వీటి వల్ల యాస్పర్‌గిల్లోసిస్ అనే ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధి కోళ్లకు వచ్చే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి వల్ల కోడి పిల్లలు అధికంగా చనిపోతాయి. పెద్దకోళ్లు గిడస బారి ఎదుగుదల తగ్గి, ఉత్పత్తి సామర్థ్యం కోల్పోతాయి.
- ఇన్ఫెక్షియస్ లారింగో ట్రాకైటీస్, ఐబీ(ఇన్ఫెక్షియల్ షైటీస్): కొరైజా హిమోఫిలస్ పారిగాలిసిరమ్ అనే సూక్ష్మక్రిమి వల్ల కోళ్లకు ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి బారిన పడిన కోళ్లలో 20 శాతం వరకు మృత్యువాత పడతాయి.
- సీఆర్‌డీ మైకోప్లాస్మా: గాలిసీరమ్ అనే క్రిమి వల్ల ఈ వ్యాధి వస్తుంది. అధిక తేమ, అపరిశుభ్రత వాతావరణంతో ఈ వ్యాధి త్వరితగతిన వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి వచ్చిన షెడ్లలో గురక చప్పుడు వినిపించవచ్చు.

■ ఐఎల్‌టీ లేదా ఇన్‌క్షియస్ లేరింగోట్రై కైటీస్: ఈ వ్యాధి సోకితే గురక వంటి శబ్దాలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, ఊపిరి తీసుకునే టప్పుడు మెడ సాగదీయడం వంటివి గమనించవచ్చు.శీతాకాలంలో వ్యాధులు నిరోధించడానికి పశువైద్య నిపుణులు సూచించిన మేరకు తగిన సమయంలో తగిన మోతాదుల్లో టీకాలు వేయించి జాగ్రత్త వహించాలి.

- షెడ్డులోకి వాహనాలు, అపరిశుభ్రత కాళ్లతో వెళ్లకూడదు.
- ఎల్లప్పుడు తాజానీరు, దాణా మాత్రమే అందించాలి. తేమశాతం అధికంగా ఉండి నిల్వ ఉన్న దాణాలో శిలీంద్రాలు పెరిగే అవకాశం ఉన్నందున మిగిలిపోయిన దాణాను పారబోసి తాజా దాణాను ఇవ్వాలి.
- పశువైద్యుల సూచనల మేరకు తగినంత మోతాదులో ఆక్సిటెట్రాసైక్లిన్, సల్ఫాడిమిడిన్ వంటి యాంటి బయోటిక్స్ ఇతర శానిటైజర్లు, విటమిన్లు దాణా నీటిలో కలిపి ఇవ్వాలి.

ఇవి పాటించాలి

- ఫారం కోళ్లతో దేశీయ(నాటు) కోళ్లు, వలస పక్షులు కలవకుండా చూడాలి.
- పౌల్ట్రీఫాం ప్రాంగణంలో నీరు నిలువ ఉండకుండా చూడాలి.
- కోళ్లఫారాల్లో తిరిగే వ్యక్తులు గమ్‌బూట్లు, గ్లౌజులు, ముఖానికి మాస్కులు ధరించాలి.
- కోళ్లఫారాల్లో ఒకే వయసు ఉన్న పిల్లలను పెంచాలి.
- ఒక ఫారం నుంచి మరో కోళ్ల ఫారానికి వ్యక్తులు వెళ్లరాదు.
- కోళ్ల ఫారాల్లోకి వెళ్లేటప్పుడు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. క్రిమి సంహారక మందులు ఉపయోగించి శుభ్రం చేసుకోవాలి.
- ఫారాల్లో ఉండే నీరు, దాణా, సామాగ్రి శుభ్రంగా ఉంచాలి. ప్రతి 15 రోజులకు ఒకసారి క్రిమి సంహారక మందుతో శుభ్రం చేస్తుండాలి.
- వేరే కోళ్ల ఫారాల నుంచి వస్తు సామగ్రి తీసుకోరాదు.
- కోళ్లఫారం ప్రాంగణం అంతా కంచె వేయాలి.
- కోడిగుడ్లకు డిస్పోజబుల్ అట్టలు వాడాలి.
- ప్రతీ బ్యాచ్‌ను పరీక్ష చేసిన తరువాతనే కోళ్ల దాణాను వాడాలి.
- పౌల్ట్రీ ప్రాంగణానికి ఆరు అడుగుల దూరంలో ఏ విధమైన చెత్తాచెదారం, కుళ్లిన పదార్థాలు పడేయరాదు.
- ఫౌల్ట్రీలో చనిపోయిన కోళ్లను పశువైద్య నిపుణులకు చూపించి ఏ వ్యాధితో చనిపోయిందో తెలుసుకుని ఇతర కోళ్లకు ఆ వ్యాధి వ్యాప్తి చెందకుండా జాగ్రత్త పడాలి.